# కథ

**ఆదివారం పొద్దున్న పది గంటలకే సాంబారు, అప్పడాలు, కొబ్బరి పచ్చడి, ఇష్టమైన కూరలతో తృప్తిగా భోంచేసి పొద్దున్న చదివిన పేపర్‌లో చదవకుండా మిగిలిపోయిన భాగాల్ని 'తదుపరి కార్యక్రమం'లా చదవడానికి అందుకున్న విజయ్‌కాంత్ దగ్గరికి చేరింది శ్రావ్య.**

# ఎక్స్ఛేంజ్ ఆఫర్

వరాలు కోరుకునే ముందు భక్తులు దేవుడిని తృప్తిపరుస్తారు అన్న సంగతి బాగా ఒంటబట్టించుకున్న శ్రావ్య తన కేదయినా కావలసివస్తే విజయ్‌ని ఎప్పుడు అడగాలి, ఎప్పుడు తన కోరికల లిస్ట్ విప్పితే 'నో' అన్న సమాధానం రాదు అన్నది పెళ్ళైన పన్నెండేళ్ళుగా రీసెర్చి చేసి క్షుణ్ణంగా తెలుసుకుంది.

"ఏమండీ" గోముగా పిలుస్తున్న శ్రావ్య ముద్దులొలికే ముద్దమందారంలా కన్పించింది విజయ్ కళ్ళకి. పొట్ట బరువెక్కి, కళ్ళు సగం మూసుకుపోతూంటే పడక్కుర్చీలో పవళించిన విజయ్ 'ఏమి కావలెను కోరుకో బాలా' అన్నట్టు శ్రావ్య వైపు చూశాడు మత్తుకళ్ళతో.

"ఏవండీ..పండగొస్తోంది" శ్రావ్య నాంది పలికింది.

విజయ్ నిద్రమత్తు వదిలింది.

సర్దుకుని లేచాడు.

"నాకు నిద్రవస్తోంది"

"పేపర్ చదివినంతసేపూ రాదు" శ్రావ్య మూతి విరిచింది. విజయ్ ఆవలిస్తూ బెడ్రూమ్ వైపు నడిచాడు.

"ఇదిగో ఇది చూడండి" శ్రావ్య పేపర్‌తో సహా విజయ్ వెనుక నడిచింది. కళ్ళముందు పరిచిన పేపర్ వైపు చూశాడు విజయ్. 'ఏమిటో' అనుకుంటూ.

'షాప్ కరో ప్యాకెట్ భరో' హెడ్డింగ్‌తో అక్షరాలు భూతద్దాలు లేకుండానే మామూలు కళ్ళకే తాటికాయల్లా కన్పించాయి. దానికింద చిన్నా పెద్దా కాలమ్స్‌లో ఊళ్ళో ఉన్న అన్ని షాపుల అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు, యాభై శాతం తగ్గింపు, డెబ్భై శాతం తగ్గింపు, గొప్ప తగ్గింపు, 'ఒక టికొంటే ఒకటి ఫ్రీ', 'ఒకటి కొంటే రెండు ఫ్రీ' (నమ్మాలి) 'పాతది పట్టుకురండి-కొత్తది పట్టుకెళ్ళండి' 'మహా ఎక్స్ఛేంజ్-మహా ఆఫర్' ఈజీ వాయిదాలు, 'డబ్బు గురించి మీకెందుకు చింత-కార్డుందిగా చెంత' లాంటి ప్రకటనలు మతి పోగొట్టేలా తొంగి చూస్తున్నాయి. వీళ్ళందరికీ బాబులా ఇంకో ప్రకటన కనిపించింది. మీరేం కొనకపోయినా పర్వాలేదు. జస్ట్ మా షాప్‌లో అడుగుపెట్టండి. రోజూ జరిగే లక్కీ 'డ్రా'లో ఎంటర్ అవండి అంటూ. అక్కడ షాప్ ఫోటో దాని ముందు నవ్వుతూ ఆహ్వానిస్తున్న అందమైన మోడల్, 'ఎంటర్ ది డ్రాగన్' ఆ తర్వాత మీ సంగతి చూస్తా అన్నట్టుగా కన్పించింది విజయ్ కళ్ళకి. అయినా చక్రవ్యూహంలోకి వెళ్ళిన వాళ్ళని షాపులో ఉన్న సేల్స్ వీరులు, శూరులు నాలుగువైపులా కమ్ముకుని ఏదో ఒకటి కొనకుండా బయటపడనిస్తారా..పేపర్‌లో విజయ్ ఎప్పుడూ చదవకుండా, చూడకుండా వదిలేసే పేజీ..శ్రావ్య పేపర్ మొత్తంలో చూసే పేజీ అది.

"మొన్ననే సంక్రాంతి వెళ్ళింది. మళ్ళీ ఇంతలోనే చీరల నంబరమా? దేనికోసం" అదే అడిగాడు విజయ్.

"పండగొస్తోందిగా.." మనకి పాడ్యమి నుంచి మొదలుకొని పధ్నాలుగు తిథులూ పౌర్ణమి, అమావాస్య అన్నీ పండగలే. ఉగాది, సంక్రాంతి, దసరా లాంటి కొత్త చీరలు కొనే పండగలతో పాటు..ఇంగ్లీషు వాళ్ళ పుణ్యమాని మేరేజ్‌డేలు, వేలంటైన్స్ డేలు..బర్త్ డేలు సరేసరి అన్నీ చీరలు కొనాల్సిన సందర్భాలే.

"ఇంతకీ ఏం పండగ?"

"హోలీ" శ్రావ్య కొంటెగా నవ్వుతూ అంటుంటే విజయ్ పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు. శ్రావ్య చీరలు కొనే పండగల లిస్ట్‌లో ఇది ఇదివరకు లేదు. కొత్త ఎడిషన్ కాబోలు.

"అలా గుడ్లు తేలేయకండి. ఎలాగూ ఉగాది వస్తోంది కదా మంచి ఆఫర్ ఉన్నప్పుడే కొనేసుకుంటే చౌకగా వస్తుంది."

"ఆఫర్ ఉండనిదెప్పుడు..ఏడాది పొడుగునా ఏదో ఓ వంకన ఆఫర్లు, డిస్కౌంట్లు, రిబేట్లు ఇస్తూనే ఉంటారుగా షాపులవాళ్ళు మీ ఆడాళ్ళకోసం. ఇంతకీ ఇందులో నీ మనసు దోచిన షాపేది?"

"ఇది చూడండి. ఎక్స్ఛేంజ్ ఆఫర్... పాత పట్టుచీర ఇస్తే కొత్తదిస్తారు. మనకి చౌకపడుతుంది" శ్రావ్య ఉత్సాహంగా అంది. ఇదివరలో పాతబట్టలు పనివాళ్ళకి ముష్టివాళ్ళకి ఇచ్చేవారు. లేకపోతే స్టీలు సామాన్లవాళ్ళు ఓ చెంచా చేతిలోపెట్టి పట్టుకుపోయేవాళ్ళు. ఆఖరికి పాతబట్టలకి కూడా షోరూముల్లో చోటు దొరికింది కాబోలు.

"పాతదిచ్చేస్తే..అలాగే కొత్తదిచ్చేస్తారా.."

"వేళాకోళం చెయ్యక్కరలేదు. పాత గుడ్డలకి అంతే ఇంతే ఇస్తున్నారు. అదే గొప్ప. వెధవది వనిమనుషులకీ, స్టీలు సామాన్ల వాళ్ళకీ ఇస్తే ఏం వస్తుంది"

శ్రావ్య లాజిక్‌కీ, ఉదార స్వభావానికీ విస్తుపోయాడు విజయ్. పెరటి నుంచి ఏనుగులు పోయినా..ముందు గుమ్మంలోంచి పూచికపుల్ల పోనివ్వరు అన్నదానికి పర్ఫెక్ట్ ఉదాహరణ. శ్రావ్యలాంటి వాళ్ళు ఉండబట్టే షాపుల వాళ్ళు చిన్నపిల్లలకి లాలిపప్ ఆశపెట్టినట్లు, డిస్కౌంట్లు, లక్కీడ్రాలు అని దోస్తున్నారు.

"రేపు ఎలాగూ లీవ్ పెట్టారు కదా..తొందరగా వెళ్తే మంచి స్టాక్ దొరుకుతుంది"

"రేపా.." విజయ్ గుండె లయ తప్పింది. "రేపు నేను లీవ్ పెట్టింది ఎండలో నీ వెనకాల షాపుల్లో తిరగడానికా..ఇండియా..పాకిస్తాన్ మేచ్ చూడాలని మా బాస్‌ని ఎంతో కష్టపడి కన్విన్స్ చేసి వంకరగా చూసినా కుంటిసాకు చెప్పి ఒప్పించాను"

"ఏమైనా పది చీరలు కొనాలా ఏమిటీ? మీ మేచ్ మొదలయ్యేలోపల వచ్చెయ్యమూ"

'వచ్చినట్టే..ఓ రుమాలు కొనాలంటే నాలుగు గంటలు తీసుకునే శ్రావ్య చీర కొనడం ఇంపాజిబుల్..అందులోనూ పట్టుచీర'

"అవునూ నీ దగ్గర పాత పట్టుచీరలేమున్నాయి. అన్నీ కొత్తవేగా.." విజయ్ పాయింట్ పట్టేసినట్టు సంబరపడిపోయాడు.

"అయ్యో కొత్తవి.. నా మొహానికి కొత్తవి కూడా ఉన్నాయా? పన్నెండేళ్ళనాడు పెళ్ళికి కొన్న నాలుగు చీరలేగా ఉన్నవి. అందులో రెండు చిరుగుపట్టాయి."

"మా అమ్మ తన పెళ్ళి పట్టుచీరలు నా పెళ్ళి దాకా కట్టుకుంది"

"మీరే చూడండి ఈ చీరలు... నేనేమన్నా అబద్ధం చెప్తున్నానా?" శ్రావణి రెండు పట్టుచీరలు విజయ్ ముందు పడేసింది. ఓ చీరలో మడతలో కాస్త విగిలింది. ఇంకో చీరలో జరీలో ఓ అంగుళం మేర చిరిగి ఉంది. అయినా రెండు పట్టుచీరలు కొత్తగానే కన్పించాయి విజయ్ కళ్ళకి. అదీగాక శ్రావ్య చూపించిన భాగాలు చీరకట్టులోకి పోతాయి. ఆ మాట పైకంటే ఇంట్లో భారతం మొదలయి విజయ్ భరతం పట్టేస్తుంది శ్రావ్య. 'డే అండ్ నైట్' మేచ్ కాబట్టి ఇహం-పరం రెండూ కానిస్తే సరి అనుకున్నాడు విజయ్.

ఇంతలో పక్కింటి పార్వతి చేతిలో ఎక్స్ఛేంజ్ పట్టుచీర పట్టుకుని రావటంతో శ్రావ్య విజయ్‌ని నిద్రకొదిలి చీర రంగు, నాణ్యతల మీద డిస్కషన్‌లో పడిపోయింది.

* * *


విజయ్ ఆటోలో వెళ్తూ దార్లో పెట్టిన హోర్డింగ్స్ చదువుతున్నాడు.

"ఆలసించిన ఆశాభంగం.."

"ఎవరికో.."

"ఎవరికేంటి మనకే..లేట్ చేస్తే మంచి స్టాక్ అయిపో

**చిట్టిపెద్ది ఉమ**



తుంది"

"ఈ ప్యాకెట్ భరో ఏమిటీ..మనం షాపింగ్ చేస్తే వాళ్ళ జేబులుగా నిండుతాయి"

"వాళ్ళ ప్యాకెట్లు నిండితే మన చేతికీ ప్యాకెట్లు వస్తాయిగా"

"ఈతకాయ చేతిలో పెట్టి తాటికాయ లాక్కున్నట్టు అన్నమాట"

శ్రావ్య మూతి ముడిచి ఓ చూపు చూసింది విజయ్‌వైపు.

'త్వరపడండి..ఆలసించిన ఆశాభంగం'. 'అమ్ముకునేవాళ్ళకి తొందరేమో కానీ కొనేవాళ్ళు నిదానంగా చూసి కొనుక్కోవాలేమో?' విజయ్ మనసులో వ్యాఖ్యానించుకుంటున్నాడు.

షాపునిండా ఇసుక వేస్తే రాలనంత జనం. 'పొద్దున్నే షాపింగ్ చెయ్యడం కంటే ఆడవాళ్ళకి పనేముంటుంది' అన్నట్టు ఉన్నారు. ఎక్కువమంది స్త్రీ జనాభాయే. అక్కడక్కడ విజయ్‌లా పెళ్ళాల వెనక వచ్చిన మగవాళ్ళు ఆముదం తాగిన మొహాలతో పర్సులు, బ్యాగులు పట్టుకు నుంచున్నారు. స్త్రీలందరిలోనూ పాత చీరలు ఎంతో లాభంగా, తెలివిగా వదల్చుకుంటున్నామన్న సంతోషం, ఉత్సాహం...షాపువాళ్ళ మొహాల్లో గేలానికి చిక్కిన చేపల్ని చూసి సంతృప్తితో కూడిన చిరునవ్వులు, మునిముని నవ్వులు.

ఈ కౌంటర్ నుంచి ఆ కౌంటర్‌కి, ఆ కౌంటర్ నుంచి ఈ కౌంటర్‌కి చీరలు చేరుతున్నాయి. చకచకా చేతులు మారుతున్నాయి.

'మహా ఎక్స్‌చేంజి ఆఫర్' మరి అందుకే షాపంతా మహా హడావిడిగా ఉంది. ఈమధ్య అన్ని వస్తువులకీ టీవీ, ఫ్రిజ్ నుంచి నాన్‌స్టిక్ పెనం నుంచీ కుక్కర్ దాకా అన్ని వస్తువులకీ ఎక్స్‌చేంజ్ ఆఫర్ ఉంది. ఈ పాతవన్నీ పోగేసుకుని ఏం చేసుకుంటారో?

మనుషులకే ఎక్స్‌చేంజ్ ఆఫర్ లేదులా ఉంది. ఉంటే ఈ ఆడవాళ్ళంతా మొగుళ్ళనీ, పిల్లలనీ, అత్తగార్లనీ, ఆడబిడ్డలనీ అందరినీ మార్చేసి కొత్తవాళ్ళని తెచ్చుకుంటారా? ఆ ఊహకే గిలిగింతలు పెట్టినట్టు విజయ్ మొహం నిండా చిరునవ్వులు మొలుచుకొచ్చాయి.

'పెళ్ళాంతో షాపింగ్‌కి వచ్చి కూడా నవ్వుతూ ఎంత ఓపిగ్గా వాళ్ళావిడ వెనక నించున్నాడో..హు..నాకూ ఉన్నాడు మొగుడు..ఎందుకు? ఎప్పుడు షాపింగ్ చేయాలన్నా పక్కింటి పిన్నిగారినో, ఎదురింటి వదినగారినో బతిమాలాల్సిందే' శ్రావ్య వెనుక నుంచున్న సుందరాంగి శ్రావ్య అదృష్టం చూసి ఈర్ష్య పడింది. శ్రావ్య నాలుగ్గంటలు ఉన్న చీరలన్నీ తీయించి, తిరగేసి...విప్పించి ఒక్కో చీరకీ రంగుకి బోర్డర్ నప్పలేదనో, బోర్డర్‌లో జరీ తక్కువనో...మెరవటం లేదనో..బుటాలు ఉన్నాయనో..లేవనో గొణుక్కుంటూ ఆఖరకి ఆరెంజ్ కలర్ చీరకి ఆకుపచ్చ బోర్డర్, జరీ బుటా ఉన్న చీరని సెలక్ట్ చేసింది. కొత్తచీర కొన్నాక తన పాత చీరకి సరియైన రేటు రాబట్టుకోవడానికి ఓ గంట వాదించింది. షాపువాళ్ళూ ఓపిగ్గా శ్రావ్య వాళ్ళ చీరలకి పెట్టిన వంకలకి ధీటుగా ఆ చీరల్లో ఉన్న లోపాలం ఎత్తి చూపించి, మూతి విరిచి, పెదవివిరిచి రేటు తగ్గించారు. 'టగ్ ఆఫ్ వార్' సాగి సాగి ఆఖరికి వాళ్ళకే విసుగెత్తిపోయి రాజీపడిపోయారు. రెండు పాత పట్టుచీరలు షాపువాళ్ళకి, కొత్తచీర శ్రావ్య చేతికీ చేరుకున్నాయి. శ్రావ్య పట్టుచీర 'ఫ్రీ'గా వచ్చినట్టు సంబరపడిపోయింది. రెండు వేలు ఇచ్చిన విజయ్‌కి ఇంకో నాలుగొందలు ఇస్తే సరిపోయేదానికి రెండు శుభ్రమైన పట్టుచీరలు ఇవ్వడంలో లాభసాటి బేరం ఏంటో అర్థం కాలేదు. శ్రావ్యకి అర్థమైంది కాబట్టి మగబుద్రలకి ఈ లాభ నష్టాలు అర్థం కావు అని సరిపెట్టేసుకున్నాడు. ఇంటికొచ్చి టీవీ ముందు మిగిలిన మేచ్ చూడ్డానికి కూర్చున్నాడో లేదో పక్కింటి పార్వతి పరుగులాంటి నడకతో పట్టుచీర చూడ్డానికి వచ్చేసింది.

శ్రావ్య సంబరంగా చీర చూపించింది.

"అయ్యో శ్రావ్యా ఇది తెచ్చుకున్నావా, మంచి చీరలన్నీ వదిలేసి. ఇది మా ఆడపడుచు మొన్న ఎక్స్‌చేంజ్‌లో ఇచ్చిన చీర..."

శ్రావ్య మొహం నల్లబడిపోయింది.

"ఇది కొత్త చీర..మీ ఆడపడుచు పాత చీరేం కాదు.."

"మరీ పాతదేం కాదులే..నాలుగేళ్ళే అయింది కొని. అసలు మా ఆడపడుచు దీన్నెక్కువ కట్టుకోలేదు. నచ్చలేదన్నా వాళ్ళత్తగారు ఈ చీర కొందని నాలుగుసార్లు ఆవిడ కోసం కట్టి మూల పెట్టింది. ఇదిగో కట్టంచులో పురుగుకొట్టిన చిల్లు ఉంది చూశావా? మొన్న మా వనజతో నేను కూడా వెళ్ళానుగా. అందుకే నాకు బాగా తెలుసు"

పార్వతి లోలోపల నవ్వుకుంటూ పైకి విచారం నటిస్తూ అంది. తెల్లకాగితంలా తెల్లబడిపోయిన శ్రావ్య వైపు ఓసారి జాలిగా చూసి తను వచ్చిన పనైపోయినట్టు వెళ్ళిపోయింది పార్వతి.

బద్దలవడానికి రెడీగా ఉన్న నీళ్ళకుండలా, భారంగా ఉన్న శ్రావ్యని చూస్తే జాలేసింది విజయ్‌కి.

"రేపు. మళ్ళీ వెళ్ళి ఎక్స్‌చేంజ్ చేసుకుందాంలే శ్రావ్యా" ఓదార్పుగా అన్నాడు విజయ్.

'ఒకసారి అమ్మిన సరుకు ఎటువంటి పరిస్థితుల్లోనూ వాపస్ తీసుకోబడదు. ఎక్స్‌చేంజ్ చేయబడదు' అని రాసి ఉన్న రశీదు చూపించింది శ్రావ్య.

"అవును మరి. వాళ్ళు చేస్తున్నది వ్యాపారం"

"నో ఎక్స్‌చేంజ్ అన్నమాట"

"పాత దానికి పాతదే.."

"ఎక్స్‌చేంజ్ చేసిన చీరకి ఎక్స్‌చేంజ్ చేసిన చీరే. పైగా రెండు వేలు ఖర్చు" విజయ్ గుండె కూడా మూలిగింది.

మరి పార్వతి ఆడపడుచుకి ఏ ఎక్స్‌చేంజ్ చీర దొరికిందో?